# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 11-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- దేశాన్ని విభజించడానికి కుట్ర పన్నుతున్న శక్తులను ఓడించి.. ఐక్యంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.

- ధృఢంగా, ఆరోగ్యంగా ఉన్న యువత దేశ వృద్ధికి నాయకత్వం వహించడంలో సహాయ పడతారని కేంద్రమంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అన్నారు.

- భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారడంలో సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

- దేశ యువత ఆత్మ విశ్వాసం కలిగి నిర్భయులుగా ఉండాలని భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా సూచించారు.

- భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య మొదటి వన్డే మ్యాచ్‌లో 301 పరుగుల లక్ష్య ఛేధనలో భారత్ 35 ఓవర్లు పూర్తయే సరికి 2 వికెట్లు కోల్పోయి 220 పరుగులు చేసింది.

=====================

దేశాన్ని విభజించడానికి కుట్ర పన్నుతున్న అన్ని శక్తులను ఓడించి, ఐక్యంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. మూడు రోజుల గుజరాత్ పర్యటన సందర్భంగా ప్రధాని ఈ రోజు సోమనాథ్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. అనంతరం ప్రభాస్ పటాన్‌లో సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ సందర్భంగా జరిగిన సభలో నరేంద్రమోదీ ప్రసంగిస్తూ... వికసిత్ భారత్ లక్ష్యం కోసం భుజం భుజం కలిపి, హృదయపూర్వకంగా ముందుకు సాగాలని దేశ ప్రజలను కోరారు. సోమనాథ్ ఆలయంపై విదేశీ దురాక్రమణదారులు అనేక దండయాత్రలు చేశారని అన్నారు. ఈ ఆలయం ధైర్యం, త్యాగాలు, దృఢసంకల్పానికి నిదర్శనమని పేర్కొన్నారు. వెయ్యి సంవత్సరాల తర్వాత కూడా ఆలయంపై జెండా ఎగురుతూనే ఉందని, అది భారతదేశ స్ఫూర్తిని ప్రపంచానికి చాటుతోందని నరేంద్రమోదీ పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

ధృఢంగా, ఆరోగ్యంగా ఉన్న యువత దేశ వృద్ధికి నాయకత్వం వహించడంలో సహాయ పడతారని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ అన్నారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన ఫిట్ ఇండియా - సండేస్ ఆన్ సైకిల్ 56వ విడత కార్యక్రమంలో కేంద్రమంత్రి  పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సైక్లింగ్ ద్వారా దేశ యువత ఓపికగా ఎలా ఉండాలో, వేగాన్ని ఎలా నియంత్రించాలో నేర్చుకోగలుగుతారని పేర్కొన్నారు. సైక్లింగ్ జీవితంలో, నాయకత్వంలో సమతుల్యత అవసరాన్ని తెలియజేస్తుందని వివరించారు. దేశంలోని యువత `సండేస్ ఆన్ సైకిల్` కార్యక్రమాన్ని 15 వేలకు పైగా ప్రదేశాలలో నిర్వహిస్తూ... శారీరక ధారుఢ్య ఆవశ్యకతను ప్రచారం చేస్తున్నారని మన్సుఖ్ మాండవీయ తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం భారతదేశంలో మౌలిక సదుపాయాలను ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేసిందని బీజేపీ సీనియర్ నాయకులు, కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ఆయన ఈ రోజు కేరళ తిరువనంతపురంలోని స్థానిక సంస్థలకు ఎన్నికైన బిజెపి సభ్యుల రాష్ట్ర సమావేశంలో ప్రసంగిస్తూ.... వికసిత్ భారత్‌కు మార్గం వికసిత్ కేరళ గుండా వెళుతుందని, వికసిత్ కేరళను నిర్మించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమతుల్య అభివృద్ధి నమూనాను దేశానికి అందించారని అమిత్ షా కొనియాడుతూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్... ఆలోచనలు, సృజనాత్మకత, నాయకత్వం కలిసే జాతి నిర్మాణ వేదిక అని కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.  వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ లో పాల్గొన్న జమ్మూ కాశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన యువ బృందంతో మంత్రి ఢిల్లీలో ఈ రోజు మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతను మంత్రి ప్రస్తావిస్తూ.. నేటి యువత 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారే ప్రయాణంలో చురుకైన భాగస్వాములని అన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగవంతం చేయడానికి కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడంలో ప్రధానమంత్రి ప్రధాన వేదిక అయిన ప్రో-యాక్టివ్ గవర్నెన్స్ అండ్ టైమ్లీ ఇంప్లిమెంటేషన్ (PRAGATI) 50వ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించి.. ఒక ముఖ్యమైన మైలురాయిని సాధించింది. 2015లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దీనిని ప్రారంభించిన నాటి నుండి ఈ వ్యవస్థ పాలన గతిని మార్చింది. ఈ వేదిక ద్వారా రైల్వే మంత్రిత్వ శాఖ జబల్పూర్-గోండియా గేజ్ మార్పిడి ప్రాజెక్టు అభివృద్ధి ఎలా జరిగిందో తెలుసుకుందాం. ఈ ప్రాజెక్ట్ దాదాపు 285 కిలోమీటర్ల విస్తరించి ఉంది. దేశంలోని మధ్య ప్రాంతంలో రైలు సామర్థ్యం, కార్యాచరణ సౌలభ్యాన్ని బలోపేతం చేయడానికి దాదాపు 1,991 కోట్ల రూపాయల వ్యయంతో దీనిని ఆమోదించారు. ఈ ప్రాజెక్టులో బాలాఘాట్-కటంగి విభాగంతో సహ ప్రస్తుత నారో-గేజ్ ను బ్రాడ్ గేజ్‌గా మార్చడం జరిగింది. తద్వారా అనేక రైలు కారిడార్‌లకు ప్రత్యామ్నాయ మార్గాన్ని సృష్టించారు. ఈ ప్రాజెక్ట్ నిరంతర పర్యావరణ, సమన్వయ సంబంధిత సవాళ్లను ఎదుర్కోవడంతో 2016 మార్చిలో దీనిని PRAGATI యంత్రాంగం కిందకు తీసుకున్నారు. దాంతో సమయానుకూల నిర్ణయాల కోసం పలు మంత్రిత్వ శాఖల మధ్య సన్నిహిత సమన్వయాన్ని ప్రగతి సమీక్ష ద్వారా సాధించారు. 2021 మార్చిలో జబల్పూర్-గోండియా బ్రాడ్-గేజ్ కారిడార్ పూర్తిగా ప్రారంభించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారడంలో సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గుజరాత్ రాజ్‌కోట్‌లో కచ్ - సౌరాష్ట్ర ప్రాంతాల రెండు రోజుల వైబ్రంట్ గుజరాత్ ప్రాంతీయ సమావేశాన్ని ప్రధానమంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రపంచంలోనే అతిపెద్ద 30 గిగావాట్ల క్లీన్ ఎనర్జీ పార్క్‌ను కచ్‌లో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నైపుణ్యాలు, ప్రపంచ దేశాలతో సంబంధాల కారణంగా జామ్‌నగర్-రాజ్‌కోట్ పారిశ్రామిక ప్రాంతం `మినీ జపాన్` అనే మారు పేరును సంపాదించుకుందన్నారు. భారతదేశంలో సౌరాష్ట్ర-కచ్ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామిక వేత్తలను ప్రధానమంత్రి  కోరుతూ...

(వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశ యువత ఆత్మ విశ్వాసం కలిగి నిర్భయులుగా ఉండాలని భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా సూచించారు. న్యూఢిల్లీలో ఈ రోజు జరిగిన వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ - 2026లో శుక్లా ప్రసంగించారు. యువత దేశానికి నిజమైన రాజధాని అని అన్నారు. యువత విజయం కోసం తమ ప్రయత్నాలను కొనసాగిస్తూ... దృఢంగా ఉండాలని శుభాన్షు శుక్లా  కోరుతూ...

(వాయిస్ 18 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా ఈ రోజు గుజరాత్ లోని వడోదర వేదికగా తొలి క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. 301 పరుగుల లక్ష్య చేధన ప్రారంభించిన భారత్ 35 ఓవర్లు పూర్తయే సరికి 2 వికెట్లు కోల్పోయి 220 పరుగులు చేసింది. విజయానికి ఇంకా 81 పరులుగు చేయాల్సి ఉంది. విరాట్ కోహ్లీ (89), శ్రేయష్ అయ్యర్ (37) పరుగులతో క్రీజ్‌లో కొనసాగుతున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

రాబోయే రెండు, మూడు రోజులలో తూర్పు, ఈశాన్య భారతదేశంలో కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుండి 3 డిగ్రీల సెల్సియస్ మేర క్రమంగా తగ్గే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఈనెల 13 వరకు ఉత్తరప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలలో ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు పరిస్థితులు ఉంటాయని, హిమాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలలో తీవ్రమైన చలిగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఈ రోజు, రేపు తమిళనాడులోని కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఫ్రాన్స్, లక్సెంబర్గ్ పర్యటనను ముగించారు. యూరప్‌తో బలపడుతున్న భారత్ సంబంధాలను ఈ పర్యటన తెలియజేసిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = =